క్లుప్తంగా

ఎంపీ నామాకు వినతులు

ఖమ్మంమయూరిసెంటర్: పలు సమస్యలపై జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పలువురు ఎంపీ నామ నాగేశ్వరరావును సోమవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామని ఎంపీ నామా వారికి హామీ ఇచ్చారు. వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్, పలువురు నాయకులు ఉన్నారు.

ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

కూసుమంచి: పాలేరులోని రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా బత్తుల ఉప్పలయ్యతో పాటు పాలక మండలి సభ్యులుగా గోపె రాము, తంగెళ్ల నర్సింహారావు, కొత్త పుల్లారెడ్డి, కన్నెబోయిన రేణుక, ఎక్స్ అఫిషియో సభ్యుడిగా శేఖరాచార్యులు నియమితులయ్యారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత ప్రమాణం చేయించారు. నూతన కమిటీ సభ్యులను పలువురు అభినందించారు.

త్వరలో ఎరుకల యుద్ధభేరి సభ



ఎమ్మెల్సీ రవిబాబును ఆహ్వానిస్తున్న నాయకులు

ఖమ్మంరాపర్తినగర్: ఈనెల చివర్లో ఎస్టీ నియోజకవర్గమైన వైరాలో ఎరుకల యుద్ధభేరి సభ జరుగుతుందని తెలంగాణ నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేడా విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ కుంభా రవిబాబును ఆహ్వానిస్తూ ఏపీకి వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. త్వరలోనే ఈసభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేస్తామన్నారు.

బకాయిలు చెల్లించాలి

నేలకొండపల్లి: మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ పరిధిలోని చెరుకు రైతులకు రావాల్సిన ఫైనల్ బకాయిల చెల్లించాలని రైతులు కోరారు. బిల్లుల కోసం ఫ్యాక్టరీ వద్ద ఆందోళనకు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో సోమవారం ఫ్యాక్టరీ వద్దకు రాజేశ్వరపురానికి చెందిన రైతులు నిరసన కోసం బయలుదేరగా విషయం తెలుసుకున్న ఫ్యాక్టరీ అధికారులు రైతులను కలిశారు. 8 నెలల నుంచి ఫైనల్ బిల్లు కోసం ఎదురు చూస్తున్నా ఇవ్వటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఫ్యాక్టరీ అధికారులు యాజమాన్యంతో చర్చించి ఈ నెల 20 వ తేది లోపు చెల్లిస్తామని హామీ ఇవ్వటంతో ఆందోళన విరమించారు.

ప్రవక్త చూపిన మార్గంలో నడవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రతీ ఒక్కరు మహ్మద్ ప్రవక్త చూపిన మార్గంలో నడవాలని తవ్వాఫ్ టూర్ అండ్ ట్రావెల్స్ నిర్వాహకులు హఫీజ్ జవ్వాద్ కోరారు. ఖమ్మం నుండి ఉమ్రా వెళ్తున్న యాత్రికులకు సోమవారం ఖమ్మంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హఫీజ్ జవ్వాద్ మాట్లాడగా, యాత్రికులకు దుస్తులు, బ్యాగులు పంపిణీ చేశారు.

ఎమ్మెల్యేను విమర్శిస్తే సహించం

కామేపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్‌ను విమర్శిస్తే సహించమని తాళ్లగూడెం బీఆర్ఎస్ పార్టీ అధ్యక్ష కార్యదర్శులు శెట్టి శ్రీనివాస్, పుచ్చకాయల బాబు అన్నారు. సోమవారం తాళ్లగూడెం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అడ్డుపడుతున్నారని విమర్శించడం సరైంది కాదని, ఎమ్మెల్యే కేటాయించిన రూ.70 లక్షలు నిధులతో గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	18	బచ్చలికూర	2
వంకాయ	40		10
బెండకాయ	18	పాలకూర	3
పచ్చిమిర్చి	38		20
కాకర	36	చుక్కకూర	3
బోడ కాకర	90		20
బీర	30	తోటకూర	2
దొండ	32		10
పొట్లకాయ	36	గోంగూర	3
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	40	మెంతికూర	3
క్యాబేజీ	20		10
క్యాలీఫ్లవర్	40	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		20
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	40		20
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	



భౌ..పెడుతున్నాయి..

వీధికుక్కలు స్వైరవిహారంతో నగరవాసుల బెంబేలు

- నియంత్రణలో అధికారుల విఫలం
- 15 రోజులుగా ఏబీసీ సెంటర్‌లో నిలిచిన శస్త్రచికిత్సలు
- రెండు రోజుల క్రితం ఓ బాలుడిపై దాడి



నగరంలో యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్ (ఏబీసీ)

ఖమ్మంమయూరిసెంటర్: వీధి కుక్కలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఒక పక్క నియంత్రణకు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ.. ఏ వీధిలో చూసినా గుంపులు గుంపులుగా కుక్కలు సంచరిస్తూ చుక్కలు చూపిస్తున్నాయి. చిన్న పిల్లలు, వృద్ధులపై కుక్కల దాడులు చేస్తున్నాయి. కుక్కల గుంపు ఉన్న ప్రాంతం మీదుగా పాదచారులు, వాహనదారులు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. రాత్రివేళ వాహనాల వెంట పడడం, పాదచారులు వెళ్తుంటే వారిపై దాడికి పాల్పడటం చేస్తున్నాయి. రోజురోజుకు కొత్తగా పిల్లల సంఖ్య పెరిగి ఏ వీధిలో చూసినా గుంపుగా కనిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం నగరంలోని మేకలనారాయణ నగర్‌లో ఓ చిన్నారిపై వీధి కుక్కలు విచక్షణ రహితంగా దాడి చేశాయి. దీంతో ఆ చిన్నారి మొహంపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో వీధి కుక్కలతో భయాందోళన చెందిన నగర ప్రజలు మరోసారి వాటి దాడి పెరగడంతో రోడ్డుపై వెళ్లాలంటే భయపడుతున్నారు.

5,500 కుక్కలకు స్టెరిలైజేషన్..

రెండేళ్లుగా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో కుక్కల సంఖ్య భారీగా పెరగడం, దాడులకు దిగుతుండటంతో నగర ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, నగర వాసులు కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను, పాలకవర్గాన్ని డిమాండ్ చేశారు. 2021 మార్చి నెలలో కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్(ఏబీసీ)ను ఏర్పాటు చేశారు. అక్కడ కుక్కలకు ప్రత్యేకంగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స (స్టెరిలైజేషన్) నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు మొత్తం సుమారు 5,500 కుక్కలకు కుక్కలకు స్టెరిలైజేషన్ చేసినట్లు కేఎంసీ అధికారులు చెబుతున్నారు. ఇందుకోసం మొత్తం రూ.కోటి వరకు ఖర్చు చేశారు.

నిలిచిన శస్త్ర చికిత్సలు..

ఖమ్మం ఏబీసీలో వీధి కుక్కలకు నిర్వహించే శస్త్ర చికిత్సలు నిలిచిపోయినట్లు తెలిసింది. 15 రోజులుగా కుక్కలకు స్టెరిలైజేషన్ చేయడం లేదని తెలుస్తోంది. పలు కారణాలతో కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయడం మానేసినట్లు కేఎంసీలో చర్చ జరుగుతుంది. అయితే వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు సక్రమంగా నిర్వహించడం లేదని, నగరంలో కుక్కల సంతానోత్పత్తి తగ్గలేదని, కుక్కల సంఖ్య భారీగానే పెరుగుతుందని నగర వాసులు అంటున్నారు. అధికారులు శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు చెప్పినా.. కుక్కల సంఖ్య మాత్రం పెరుగుతూనే ఉందని వాపోతున్నారు.

ఏ వీధి చూసినా..

నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. ఒక్క కుక్క అరిస్తే చాలు.. మిగిలిన కుక్కలన్నీ అక్కడకు చేరి అరుస్తుండటంతో పాదచారులు భయపడుతున్నారు. కొన్నిసార్లు విచక్షణారహితంగా దాడులు చేస్తున్నాయి. వీటిని నియంత్రించేందుకు ఆయా ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల నుంచి స్థానిక ప్రజాప్రతినిధులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి.

ఆగలేదు... తగ్గాయి..

కుక్కల సంఖ్య పెరగడం, యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు నిలిచిపోవడంపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. ఏబీసీ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు పూర్తిగా నిలిచిపోలేదని అన్నారు. గతంలో రోజుకు 15 కుక్కల వరకు శస్త్రచికిత్స నిర్వహించేవారని, ఇతర కారణాలతో రోజుకు ఒకటి రెండు కుక్కలకు మాత్రమే శస్త్రచికిత్స చేస్తున్నట్లు తెలిపారు. కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

నూరుశాతం టీకాలు అందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న రమణ

రఘునాథపాలెం: గర్భిణులు, చిన్నారులకు నూరుశాతం టీకాలు అందించాలని ఉద్దేశ్యంతో ఈ నెల 14 వరకు మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా వాక్సిన్ మేనేజర్ సి.హెచ్.రమణ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రఘునాథపాలెం మండలంలోని మంచుకొండ, మల్లేపల్లి, రఘునాథపాలెం, పాండురంగాపురం గ్రామాల్లో నిర్వహించిన మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమాన్ని పరిశీలించారు. వ్యాక్సినేషన్ ఇచ్చే విధానం తదితర వాటిపై అవగాహన కల్పించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖానా వైద్యులు ఉషారాణి, హారిక, సీహెచ్ఓ రమాదేవి, సూపర్‌వైజర్లు రజని, ఏఎన్ఎంలు రోహిణి, జానకి, సత్యవాణి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీ

కామేపల్లి: కొత్తలింగాల క్రాస్ రోడ్డు పోలీసులు సోమవారం ముమ్మరంగా చేపట్టారు. ఎన్నికల కోడ్ అమలైన నేపథ్యంలో సీఐ తిరుపతిరెడ్డి, ఎస్సై ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఎన్నికల నిబంధనలు పాటించాలని, నిబంధనలకు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బతుకమ్మ చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్లు

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని జమ్మిబండ బజారు జ్యోతి బాల మందిర్ స్కూల్ ఆవరణలో సోమవారం 40, 41 వ డివిజన్ల కార్పొరేటర్‌లు కర్నాటి క్రిష్ణ, దాదే అమృతమ్మ ఆధ్వర్యంలో బతుకమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నగర దీపిక మల్లిక , రేషన్ షాప్స్ డీలర్లు మురళీ, లాల్ జాన్ పాషా డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ ర్యాలీని విజయవంతం చేయాలి

తిరుమలాయపాలెం: టీఎస్‌పీఎస్సీ బోర్డుని రద్దు చేసి నిరుద్యోగ భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఖమ్మంలో నిర్వహించే నిరుద్యోగ ర్యాలీని విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు దిండు మంగపతి పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేందర్, రాజశేఖర్, శ్రీహరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దార్శనికుడు కాన్షీరాం

ఖమ్మంరాపర్తినగర్: బహుజన రాజ్యాధికారమే అంతిమ పరిష్కారమని గ్రహించి దానిని సార్థకత చేసుకున్న దార్శనికుడు కాన్షిరాం అని లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భద్రనాయక్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంఘాల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ షేక్ నజీమా కొనియాడారు. సోమవారం ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా కార్యాలయంలో ఉపేంద్రబాయి అధ్యక్షతన కాన్షిరాం వర్ధంతి సభ నిర్వహించారు. ఎల్‌హెచ్‌పీఎస్ సంఘాల ఉపాధ్యక్షుడు జంపానాయక్, కార్యదర్శి కోటేస్‌నాయక్, కోకన్వీనర్లు అబ్దుల్ రహమాన్, జంగిపల్లి రవి, నాయకులు సురభి, వెంకటేస్, మదన్‌నాయక్, రవీందర్ నాయక్, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో...

ఖమ్మం నగరంలోని రమణగుట్టలో బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ మట్టే గురుమూర్తి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ కరీం, మాధవరావు, నాగేశ్వరరావు, కిరణ్‌కుమార్, మిత్ర సాహూ, వీరాస్వామి, వినయకరావు, సంజీవరావు, సునీత, భవానీ, ప్రవీణ్, శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బచ్చోడు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలి

తిరుమలాయపాలెం: బచ్చోడు కేంద్రంగా మండలాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మండల కమిటీ కోరింది. సోమవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకయ్య మాట్లాడుతూ.. పరిపాలన సౌలభ్యం కోసం మండలం ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. మండల సాధనకు పోరాటాలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, హన్మంతరావు, శ్రీనివాసరావు, సరోజిని, వెంకటస్వామి, గిరి, ఆరెంపుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు చేయొద్దు



మాట్లాడుతున్న సీఐ రాజిరెడ్డి

ఖమ్మంరూరల్: సోషల్ మీడియా వేదికగా ఏ పార్టీ వారైనా ఆరోగ్యకరమైన, పార్టీకి సంబంధించిన విమర్శలు ఉండాలని, తప్పుడు పోస్టులు పెడుతూ అసత్య ప్రచారాలు, వ్యక్తిగత దూషణలు చేస్తే వారితో పాటు అడ్మిన్లపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని సీఐ రాజిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పలు రాజకీయ పార్టీల నాయకులతో జరిగిన అవగాహనా సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. తప్పుడు పోస్టులు పెట్టే వారిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీస్‌శాఖ ప్రతీ రోజూ పరిశీలిస్తూ ఉంటుందని, ప్రతీ ఒక్కరూ పోస్ట్ చేసే ముందు ఆలోచించి చేయాలని లేనట్లయితే వారిపై గ్రూపు అడ్మిన్లను జైలుకు పంపుతామన్నారు. ఈ సమావేశంలో ఎస్సైలు వెంకటకృష్ణ, షాకీర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దళితులందరికీ దళితబంధు ఇవ్వాలి

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంలోని దళితులందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని పలువురు బహుజన, దళిత నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కూసుమంచి సెంటర్‌లో ధర్నా చేపట్టి అనంతరం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. బహుజన నాయకులు కొమ్ము ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎడవెల్లి ముత్తయ్య, ఎంపీటీసీ మాదాసు ఉపేందర్, సర్పంచ్ పొట్టపింజర నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మట్టె గురవయ్య, గుండెపొంగు మల్లేష్, బుర్రా ఉపేందర్, మంజుల, వెంకన్న, కొండా మహిపాల్, విజయ్, వినయ్, లక్ష్మయ్య, వీరభద్రం, నాగరాజు, శ్రీకాంత్, చరణ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు కూలీబంధు..

తిరుమలాయపాలెం: వ్యవసాయ కార్మికులకు కూలీబంధు పథకం అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎర్ర శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సోమవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని గజ్జల వెంకటయ్య స్మారక భవనంలో జరిగిన సంఘం మండల సమావేశంలో మాట్లాడారు. రేపు నిర్వహించే ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నాయకులు వెంకట్రామిరెడ్డి, ధర్మాచారి, భద్రయ్య, నాగేశ్వరరావు, మహేందర్ పాల్గొన్నారు.

జీపీ భవనాలు ప్రారంభం



జీపీ భవనం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ, ఎంపీపీ

రఘునాథపాలెం: మండలంలోని హర్యతండా, బద్యతండా, కొర్లబోడుతండా లచ్చిరాంతండాల్లోని పంచాయతీ కార్యాలయాల నూతన భవనాలను ఎంపీపీ భూక్యా గౌరి, జెడ్పీటీసీ మాలోత్ ప్రియాంక సోమవారం ప్రారంభించారు. సర్పంచ్‌లు మాలోతు కాంతి, భూక్యా సుగుణ, మాలోత్ బాబిచంద్, గుగులోతు పద్మ, నాయకులు వీరు నాయక్ పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

నేలకొండపల్లి: పురుగుల మందు తాగిన యువకుడు ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. మండలంలోని మోటాపురానికి చెందిన బొడ్డు ఉపేందర్(20) సోమవారం పురుగుల మందు తాగగా, గమనించిన స్థానికులు నేలకొండపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి 108లో ఖమ్మం తీసుకెళ్లారు. ఆయన ఆత్మహత్యాయత్యానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కేవీపీఎస్ ఆవిర్భావ వేడుకలు

ఖమ్మంమయూరిసెంటర్: కుల వివక్ష పోరాట సంఘం(కేవీపీఎస్) ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. జెడ్పీసెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి కేవీపీఎస్ నాయకులు పూలు వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్, నాయకులు బొట్ల సాగర్, పాపిట్ల సత్యనారాయణ, కుక్కల సైదులు, ఆరెంపుల ఉప్పలయ్య, మునగాల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గంలోని 97 మంది మహిళలకు మంజూరైన కుట్టుమిషన్లను సోమవారం ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కూసుమంచిలో పంపిణీ చేశారు. దీంతో పాటు మైనార్టీ ఆర్థిక చేయూత 26 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు బాణోత్ శ్రీనివాస్ నాయక్, బోడ మంగీలాల్, బెల్లం ఉమా, వజ్జా రమ్య, డీసీసీబీ డైరక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ చెన్నా మోహన్, బీఆర్ఎస్ మండలాధ్యక్ష, కార్యదర్శులు వేముల వీరయ్య, ఎండి.ఆసిఫ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్ష మేరకే పాలన



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి: ప్రజా ఆకాంక్ష మేరకే బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన కొనసాగుతోందని, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కోట్లాది నిధులను సీఎం కేసీఆర్ అందిస్తున్నారని ఇల్లెందు ఎమ్మెల్యే బానోత్ హరిప్రియానాయక్ అన్నారు. సోమవారం మండలంలో పలు గ్రామాల్లో నిర్మాణాలు చేపడుతున్న సీసీ రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలను చేపట్టారు. జోగ్గూడెం గ్రామంలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. బీసీ బంధు పథకంలో భాగంగా 31 మందికి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం కొత్తలింగాల శ్రీ కోటమైసమ్మ తల్లి దేవాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం గ్రంథాలయ చైర్మన్ దిండిగల రాజేందర్, ఎంపీపీ బానోత సునీత, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, నాయకులు ఆంతోటి అచ్చయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, వడియాల కృష్ణారెడ్డి, జర్పుల భగవాన్, ఏపూరి పాపారావు, నాగండ్ల లక్ష్మణ్‌చౌదరి, ఏపూరి హేమమాలిని, మూడ్ రాధ, లకావత్ బీమానాయక్, బానోత్ రవి, లకావత్ సునీత, బొడ్డు కాంతమ్మ, రాయల చిన్న వెంకటేశ్వర్లు, కొమ్మినేని శ్రీనివాసరావు, చల్లా హరి, నాగేంద్రబాబు, బానోత్ రాందాస్, యడ్లపల్లి బాబు, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్‌తో రైతులకు అండగా..



పాలేరులో పూజలు చేస్తున్న నాయకులు

కూసుమంచి: కృష్ణా జలాల పంపిణీ శాశ్వత పరిష్కారానికి కృష్ణా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి తెలంగాణా రైతులకు నరేంద్ర మోదీ ప్రభుత్వం అండగా నిలిచిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. కృష్ణ ట్రిబ్యునల్ అనుగుణంగా నీటి కేటాయింపులకు కేంద్ర క్యాబినెట్ ఉత్తర్వులు ఇచ్చిన నిర్ణయాన్ని స్వాగతిస్తూ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం పాలేరు రిజర్వాయర్‌లో కృష్ణా జలాలకు పూజలు నిర్వహించారు. నీటిలో పూలను చల్లి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ... కేసీఆర్ నిర్లక్ష్యం వలన తొమ్మిదేళ్లుగా తెలంగాణాకు కృష్ణా జలాల పంపకంలో అన్యాయం జరిగిందని, అపెక్స్ కౌన్సిల్, తెలంగాణా ప్రభుత్వం ట్రిబ్యునల్ ఎదుట హాజరు కాకపోవటంతో సమస్యను జటిలం చేశారన్నారు. తెలంగాణాకు రావాల్సిన న్యాయమైన కృష్ణా జలాల వాటాను దక్కే విధంగా కృషిచేసిన ప్రధాని మోదీ రైతుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, పాలేరు అసెంబ్లీ కన్వీనర్ మేక సంతోష్‌రెడ్డి, నాయకులు ఉపేందర్‌గౌడ్, వీరెల్లి లక్ష్మయ్య, రామ్మోహన్ రెడ్డి, సుదర్శన్, మల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, సుధాకర్, సాగర్, మోహినుద్దీన్, మురళి పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేకు ఓటు అడిగే హక్కు లేదు'



ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాదరెడ్డి

కూసుమంచి/తిరుమలాయపాలెం: వచ్చే ఎన్నికల్లో పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డికి ఓటు అడిగే హక్కు లేదని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పొంగులేటి ప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని నర్సింహులగూడెం, చౌటపల్లి గ్రామాల్లో సోమవారం రాత్రి నిర్వహించిన గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీ కార్డుల కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందించాక ప్రసాద్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి కాంగ్రెస్ నుండి గెలిచాక అభివృద్ధి సాకుతో బీఆర్ఎస్‌లో చేరి సొంత పనులను చక్కబెట్టుకున్నారని విమర్శించారు. ఈ ఐదేళ్ల పాలేరు నియోజకవర్గానికి ఆయన చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మట్టె గురవయ్య, నాయకులు చావా శివరామకృష్ణ, సూర్యనారాయణరెడ్డి, బజ్జూరి వెంకటరెడ్డి, బాబునాయక్, రవి తదితరులు పాల్గొన్నారు. కాగా, తిరుమలాయపాలెం మండలం జూపెడకు చెందిన కాంగ్రెస్ నాయకుడు దుర్గయ్య మృతి చెందగా ప్రసాద్‌రెడ్డి నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు గోపాలరావు, అరవిందొరెడ్డి, కొప్పుల అశోక్, చావా శివరామకృష్ణ, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న బాలు

ఖమ్మం మామిళ్లగూడెం: బాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఖమ్మంలోని శాంతి నికేతన్ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో సోమవారం పండ్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ చెరుకుపల్లి బాలు, సభ్యులు ప్రవలిక, వేణు, సైదులు, వీరస్వామి, కాశయ్య, గట్టికొండ చుక్కయ్య, ఏపూరి తరుణ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్..

సాయిగణేష్ ఉత్సవ కమిటీ శుక్రవారంపేట ఆధ్వర్యంలో ఖమ్మం కేవీఎం స్కూల్ విద్యార్థులకు సోమవారం ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అలివేలు, నాగమణి, నిర్వాహకులు పూర్ణచందర్, అరుణ్, నవీన్, వల్లాల యుగంధర్, భూమా మధు, వీరనగేష్ పాల్గొన్నారు.

కోడ్ కూసింది..

ఎన్నికల షెడ్యూల్ విడుదలతో నిబంధనలను పాటించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. సోమవారం మధ్యాహ్నం షెడ్యూల్ విడుదల కాగా.. సిబ్బంది తమ పని ప్రారంభించారు. ప్రధానంగా వివిధరాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన పోస్టర్లను, ఫ్లెక్సీలను తొలగించే పని చేపట్టారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రకటనలను కూడా తొలగించేందుకు సిద్ధమవుతున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



నగరంలోని ప్రకాష్‌నగర్‌లో బీఆర్ఎస్ ఫ్లెక్సీని తొలగిస్తున్న సిబ్బంది



మమత రోడ్డులో..



నేలకొండపల్లిలో..